



ఇచ్ఛాపురం : బాహుదా నదికి భారీగా చేరిన వరద నీరు



వాయుగుండం ప్రభావంతో జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని ప్రధాన నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వంశధార ప్రమాద స్థాయికి మించి ప్రవహించింది. శుక్రవారం మధ్యాహ్నం 1.04 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహించడంతో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి క్రమేణా వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడడంతో ఉపసంహరించుకున్నారు. నాగావళి, మహేంద్రతనయ, బాహుదా నదులూ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వాగులు, గెడ్డలు పొంగిపొర్లుతున్నాయి. వేలాది ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. గాలుల తీవ్రతకు పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. కవిటి మండలంలోనే సుమారు 50 వరకు కొబ్బరి చెట్లు నేలకూలాయి. మందస మండలం సవర తెబ్బూరులో ఇల్లు కూలి భార్యాభర్తలు మృత్యువాత పడ్డారు.

పోటెత్తిన వంశధార

- గరిష్టంగా 1.04 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం
- మూడో ప్రమాద హెచ్చరిక జారీ, అనంతరం తగ్గుముఖం
- ఉధృతంగా నాగావళి, మహేంద్రతనయ, బాహుదా నదులు
- పొంగిపొర్లిన వాగులు, గెడ్డలు
- వేలాది ఎకరాల్లో వరి పంట నీటమునక
- ఇల్లు కూలి భార్యాభర్తలు మృతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన భారీ వర్షాలకు వంశధార ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. హిరమండలం మండలం గొట్టాబ్యారేజీ వద్ద ఈనెల రెండో తేదీన ఏడు గంటలకు 23 వేల క్యూసెక్కుల నీరు రావడం ప్రారంభించింది. క్రమేణా పెరుగుతూ అర్ధరాత్రి 12 గంటలకు 38 వేల క్యూసెక్కులకు చేరింది. అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో 40 వేల క్యూసెక్కులు దాటడంతో మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. మూడో తేదీ ఉదయం తొమ్మిది గంటలకు 83,258 క్యూసెక్కుల నీరు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. మధ్యాహ్నం ఒంటి గంటలకు గరిష్టంగా 1.04 లక్షల క్యూసెక్కులు నీరు చేరడంతో మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. అక్కడ్నుంచి క్రమేణా వరద నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టింది. రాత్రి ఏడు గంటల సమయానికి 88 వేల క్యూసెక్కులకు తగ్గింది. నాగావళిలో శ్రీకాకుళం పాత వంతెన గరిష్టంగా 28 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. గరిష్టంగా 40 వేల క్యూసెక్కుల వరకు చేరే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. అటు మహేంద్రతనయ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఒడిశాలో భారీగా వర్షాలు కురవడంతో బాహుదా నదికి భారీగా వరద నీరు చేరింది. ఒడిశాలోని భగలొట్టి డ్యామ్ నుంచి నీరు విడుదల చేయడంతో జిల్లా



జలుమూరు : నీటమునిగిన పంట పొలాలు

అధికారులు అప్రమత్తమయ్యారు.

ఇల్లు కూలి భార్యభర్తలు మృతి

బాహుదా నది వరద ప్రవాహంలో చిక్కుకున్న ఒక యువకుడిని పోలీసులు రక్షించారు. మెళియాపుట్టి మండలం నందవలో మూడు పూరిల్లు నేలకూలాయి. మందస మండలం సవర తుబ్బూరులో ఇల్లు కూలి భార్యాభర్తలు సవర బుద్ధయ్య (65), రూపమ్మ (60) మృత్యువాత పడ్డారు.

పొంగిపొర్లిన గెడ్డలు, వాగులు

పలాస మండలం బ్రాహ్మణతర్లా వరహాల గెడ్డ వంతెనపై నుంచి మూడు అడుగుల ఎత్తులో వరద నీరు ప్రవహించడంతో బ్రాహ్మణతర్లా, లక్ష్మీపురం, బంటుకొత్తూరు, నీలిభద్ర, కేశుపురం, పెద్దనారాయణపురం తదితర గ్రామాలకు రెండు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. కిష్టుపురం రైల్వే అండర్ పాసేజ్ లో వరద నీరు వచ్చి చేరడంతో గరుడఖండి, పాత జగదేవుపురం, జగదేవుపురం, లక్ష్మీపురం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. లావేరు మండలంలో బుడుమూరు గెడ్డ ఉధృతంగా ప్రవహించింది. మెళియాపుట్టి మండలం గోకర్ణపురం వద్ద కృష్ణసాగరం ఉప్పొంగడంతో పూర్తిగా రాకపోకలు స్తంభించిపోయాయి. సంతబొమ్మాళి మండలం మూలపేట నిర్వాసిత కాలనీ నిర్మాణ ప్రాంతం జలదిగ్బంధంలో చిక్కుకుంది. సమీప గిరిజన గ్రామాలు, గెడ్డల నుంచి వరద నీరు ముంచెత్తడంతో పలాస జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష నివాసాన్ని వరద నీరు చుట్టుముట్టింది. నందిగాం మండలం సెండెమ్మ గెడ్డ ఉధృతికి పోలవరం వద్ద నందిగాం-పోలవరం రహదారి కొట్టుకుపోయింది. వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల ప్రహరీ గోడ కూలింది.

జల దిగ్బంధంలో పలు గ్రామాలు

వంశధార ఉధృతితో కొత్తూరు మండలం పెనుగోటివాడ జలదిగ్బంధంలో చిక్కుకుంది. మాతల వంతెనపై మూడు అడుగుల మేర వరద నీరు ప్రవహించింది. అదే మండలం కుంటిభద్ర, వసప, నివగాం, మాతల, వి.ఎన్.పురం, కుద్దిగాం, పొన్నుటూరు, సోమరాజపురం, ఆకులతంపర, అంగూరు, పాతపాడు, మాకవరం తదితర గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. హిరమండలం మండలం జిల్లేడుపేటను వరద నీరు చుట్టుముట్టడంతో ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు బోట్ల సాయంతో గ్రామస్తులకు నిత్యావసర సరుకులను అందించాయి..

నిలిచిన రాకపోకలు. టెక్కలి మండలంలో పాతనౌపడ, పెద్దరోకళ్లపల్లి, సీతారాంపల్లి, రాళ్లపేట, బంజీరుపేట, సీతానగరం, తదితర గ్రామాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. సీతగెడ్డ పొంగిపొర్లడం వల్ల గ్రామాలు జలదిగ్బందంలో ఉన్నాయి. పాతపట్నంలో మహేంద్రతనయ నది కాజ్‌వేపై వరద నీరు చేరడంతో కె.గోపాలపురం, హెచ్.గోపాలపురానికి రాకపోకలు నిలిచిపోయాయి.

నీట మునిగిన పంట పొలాలు

వంశధార ఉధృతితో కొత్తూరు మండలం కుంటిభద్ర, వసప, నివగాం, మాతల, వి.ఎన్.పురం, కుద్దిగాం, పొన్నుటూరు, సోమరాజపురం, ఆకులతంపర, అంగూరు, పాతపాడు, మకవరం తదితర గ్రామాల్లో సుమారు నాలుగు వేల ఎకరాల వరకు పంట పొలాలు నీట మునిగాయి. నాగావళి వరద ఉధృతితో బూర్జ మండలం అల్లిన, వైపర్త, కిలాంత్రి, లాబాం, గుత్తావల్లి, బూర్జ గ్రామాల్లోని పొలాలు ముంపునకు గురయ్యాయి. గాలుల ఉధృతికి లావేరు మండలం కేశవరాయపురం, సీతంవలస, లావేటిపాలెం, లావేరు, గోవిందపురం, వెంకటాపురం తదితర ప్రాంతాల్లో బొప్పాయి, అరటిచెట్లు నేలకొరిగాయి. మొక్కజొన్న పంట దెబ్బతింది. మెళియాపుట్టి మండలంలో 160 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. సంతబొమ్మాళి మండలంలోని నౌపడ, సీతానగరం, శలగపేట, కూర్మనాథపురం తదితర ప్రాంతాల్లో పంట పొలాలు పూర్తిగా వరదనీరుతో నీట మునిగాయి. జలుమూరు మండలంలో వంశధార వరద ఉధృతికి అచ్యుతాపురం పంచాయతీ పరిధిలోని పంట పొలాలు మునిగిపోయాయి. వజ్రపుకొత్తూరు మండలం చినడోకులపాడు చెరువుకు గండి పడడంతో చెరువు నీరు పంట పొలాలపై పడింది. ఈదురుగాలుల ప్రభావంతో సరుబుజ్జిలి మండలంలోని పాతపాడు గ్రామంలో పొట్ట దశలో వరి చేలు నేలకొరిగాయి.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

జిల్లాలోని 27 గ్రామాల్లో 74 విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. 350 మీటర్ల విద్యుత్ లైన్లు తెగిపడగా, ఒక 5 ఎంవిఎ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు నాలుగు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు పాడయ్యాయి. చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లపై పడడంతో అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కవిటి మండలం డి.జిపుట్టుగలో చెట్లు విరిగి విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. లావేరు మండలంలో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో అంధకారం నెలకొంది. విద్యుత్‌శాఖ సిబ్బంది మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టారు.

వరద ప్రభావిత గ్రామాల్లో కలెక్టర్,ఎస్‌పి పర్యటన

వంశధార, నాగావళికి ఆకస్మిక వరదలు వస్తాయన్న విపత్తులశాఖ హెచ్చరికలతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి రెండో తేదీ అర్ధరాత్రి నుంచి హిరమండలం, పాతపట్నం, బూర్జ మండలాల్లో పర్యటించి వంశధార, నాగావళి వరద పరిస్థితులను పరిశీలించి, నదీ పరివాహక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు.




వజ్రపుకొత్తూరు : కొట్టుకుపోయిన పెద్దబాడాం రహదారి



లావేరు : రోడ్డుకు అడ్డంగా విరిగిపడ్డ చెట్టు



కవిటి : డిజి పుట్టుగలో విద్యుత్ వైర్లపై పడిన చెట్టు



లావేరు : కేశవరాయపురంలో నేలవాలిన బొప్పాయి పంట



పలాస : కంబిరిగాం బ్రిడ్జి పై నుంచి ప్రవహిస్తున్న వరహాల గెడ్డ

శ్రమజీవుల గొంతుకగా...

- జిల్లాలో ఎన్నో ఉద్యమాలకు నాయకత్వం వహించిన సిఐటియు
- నిర్బంధాలు, అణచివేతల నడుమ అంచెలంచెలుగా ఎదిగిన వైనం
- కార్మికుల కష్టాలు, కన్నీళ్లకు తోడుగా నిలిచిన ట్రేడ్ యూనియన్
- సోంపేటలో నేటి నుంచి రెండు రోజుల పాటు 12 మహాసభలు

జిల్లాలో ఎన్నో సమరశీల ఉద్యమాలకు నాయకత్వం వహించిన సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు) 12వ మహాసభలకు సిద్ధమవుతోంది. ప్రభుత్వ నిర్బందాలు, అణచివేతలను ఎదుర్కొని జిల్లాలో బలమైన సంఘంగా సిఐటియు పేరొందింది. 1992లో ప్రాణం పోసుకున్న యూనియన్ ఇంతింతై వటుడింతై అన్న చందంగా అంచెలంచెలుగా ఎదిగింది. నిరంతరం కార్మిక సమస్యలపై పోరాడుతూ కార్మికవర్గ రథసారథిగా గుర్తింపు పొందింది. కార్మికుల కష్టాలు, కన్నీళ్లకు అండగా నిలిచింది. గత మూడేళ్లుగా సాగించిన పోరాటాలను సమీక్షించుకుని భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకునేందుకు మరోసారి సిద్ధమవుతోంది. సోంపేటలోని వి.జి.కె మూర్తి నగర్ (శైలజ కళ్యాణ మండపం)లోని ఎం.వి సత్యనారాయణ ప్రాంగణంలో నేటి నుంచి రెండు రోజుల పాటు మహాసభలు జరుగనున్నాయి.



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలోని కార్మికుల సమస్యలపై సిఐటియు నిరంతరం పోరాడుతోంది. రణస్థలం మండలం శ్యామ్‌పిస్టన్స్ ప్లాంట్-2లో 30 ఏళ్లు పూర్తయిన కార్మికులను తొలగించేందుకు యాజమాన్యం ప్రయత్నించిన సందర్భంలో సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు అనేక రూపాల్లో ఆందోళనలు చేపట్టారు. ప్రస్తుతం కల్పిస్తున్న 14 రోజుల పని దినాలు కాకుండా పూర్తిస్థాయిలో పని కల్పించడం కోసం మరోవైపు న్యాయ పోరాటం సాగిస్తోంది. సిఐటియు చేసిన సాగించిన పోరాటాల ఫలితంగా నాగార్జున అగ్రికమ్ పరిశ్రమలో వేతన ఒప్పందానికి యాజమాన్యం ముందుకొచ్చింది. మందస, కోటబొమ్మాళి రైస్‌మిల్లు కార్మికుల సమస్యలపై పోరాడి విజయం సాధించారు. నీలం జ్యూట్ పరిశ్రమ అక్రమ లాకౌట్‌కు వ్యతిరేకంగా కార్మికుల పక్షాన పోరు సల్పింది. ఎచ్చెర్ల బాట్లింగ్ కార్మికుల సమస్యలపై పోరాడింది. వీటితో పాటు స్కూల్ స్వీపర్స్, పలాస లారీ డ్రైవర్స్, పొందూరు గ్యాస్ డెలివరీ బాయ్స్, కంచిలి వేర్‌హౌస్ హమాలీ కార్మికులకు అండగా పోరాడారు.

స్కీమ్‌వర్కర్ల సమస్యలపై అలుపెరుగని పోరు

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్కీమ్‌వర్కర్లకు గ్రామాల్లో వేధింపులు మొదలయ్యాయి. వాటిని తాళలేక ఏకంగా ఉద్యోగాలనే విడిచిపెట్టేస్తున్న పరిస్థితి నెలకొంది. నందిగాం మండలం కొత్త ఆగ్రహారంలో మడ్డు సావిత్రమ్మ అనే మహిళ 24 ఏళ్లుగా మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పనిచేస్తోంది. ఆమె కుమారుడు వైసిపి తరుపున ప్రచారం చేశారనే నెపంతో అక్కడి టిడిపి నాయకులు పట్టుబట్టి మరీ తొలగించారు. మెళియాపుట్టిలో ఓ వంట కార్మికురాలిని తొలగించేందుకు ప్రయత్నించగా ఎపి మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ అడ్డుకోవడంతో అది నెరవేరలేదు. గార మండలం చిన్నముదిటిపేటలో పనిచేస్తున్న ఒక అంగన్వాడీ కార్యకర్తను గ్రామ పెద్దలు, కొందరు టిడిపి నాయకులు వేధించిన సందర్భంలో యూనియన్ ఆమెకు అండగా నిలిచింది. సంతబొమ్మాళి మండలం నట్టివలస పంచాయతీ గెద్దలపాడులో అంగన్‌వాడీ కార్యకర్తను తొలగించేందుకు రూ.1.90 లక్షలకు వేలం పాట నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నారన్న వార్తలతో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జోక్యం చేసుకుని అధికారులకు ఫిర్యాదు చేయడంతో ప్రస్తుతం ఆగింది. ఇదే గ్రామంలో ఆశా కార్యకర్త ఉద్యోగానికి వేలంపాట నిర్వహించడంతో ఆశా వర్కర్స్ యూనియన్ ప్రతిఘటించడంతో ఆ ప్రకియ నిలిచింది.

కార్మికుల కుటుంబాలకు అండగా...

సిఐటియు కేవలం పోరాటాలకే పరిమితం కాకుండా కార్మికుల కుటుంబాలకు అండగా నిలుస్తోంది. ప్రమాదశాత్తు మరణించిన, జబ్బుల బారిన పడి మృతి చెందిన కుటుంబాలకు ఆర్థికసాయం అందించింది. శ్యామ్‌పిస్టన్, నాగార్జున అగ్రికమ్, రెడ్డీస్ లేబొరేటరీస్ తదితర పరిశ్రమల్లో పనిచేసి మరణించిన కుటుంబాలకు తోటి కార్మికుల నుంచి ఒక రోజు వేతనం సేకరించి అందించింది.

మహాసభలకు సోంపేట ముస్తాబు

మహాసభలు జరగనున్న సోంపేట పట్టణం ముస్తాబైంది. ప్రధాన కూడళ్లను, వేదిక ప్రాంతాన్ని ఎర్రజెండా తోరణాలతో అలంకరించారు.

షెడ్యూల్ ఇలా...

మహాసభల్లో భాగంగా తొలి రోజు శనివారం ఉదయం తొమ్మిదన్నర గంటలకు పతాక ఆవిష్కరణ చేయనున్నారు. అనంతరం ప్రతినిధుల సభ నిర్వహించనున్నారు. మరుసటి రోజు మధ్యాహ్నం రెండు గంటలకు సోంపేట తిరుమల ధీవార్ నుంచి గాంధీ మండపం వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం బహిరంగ సభలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు ప్రధాన వక్తగా ప్రసంగించనున్నారు.



ఎర్రజెండా తోరణాలతో అలంకరించిన సోంపేట మెయిన్ రోడ్డు

మహాసభల వేదిక

బస్సు ఢీకొని 12 గొర్రెలు మృతి

ప్రజాశక్తి - లావేరు

మండలంలోని సుభద్రాపురం సమీపంలోని చీపురుపల్లి రహదారిపై శుక్రవారం ఆర్‌టిసి బస్సు ఢీకొని 12 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. మరో నాలుగు గాయపడ్డాయి. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం సుభద్రాపురానికి చెందిన కోరాడ కోటేశ్వరరావు, గోవింద, కోండ్రు నారాయణ తమకు ఉన్న గొర్రెలను మేత కోసం రోడ్డు మీదుగా తీసుకెళు న్నారు. శ్రీకాకుళం నుంచి చీపురుపల్లి వెళ్తున్న ఆర్‌టిసి బస్సు ఎదురుగా వస్తున్న లారీని తప్పించే క్రమంలో రోడ్డు పక్క నుంచి వెళ్తున్న గొర్రెల పైకి వెళ్లింది. దీంతో 12 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో నాలుగు గాయపడ్డాయి. సుమారు రూ.మూడు లక్షల విలువ చేసే గొర్రెలు చనిపోవడంతో బాధితులు విలపించారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ఘటనాస్థలికి చేరుకుని మృత్యువాత పడిన జీవాలను పరిశీలించారు. తమ జీవనాధారం పోయిందని, తమను ఆదుకోవాలని బాధితులు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే పశుసంవర్ధకశాఖ అధికారులుకు ఫోన్ చేసి బాధితులకు నష్టపరిహారం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట తహశీల్దార్ జి.ఎల్.ఇ శ్రీనివాసరావు, పశు వైద్యాధికారి గాయత్రి, తాళ్లవలస మాజీ సర్పంచ్ ముప్పిడి మురళీమోహన్, ముప్పిడి శ్రీనివాసరావు తదితరులున్నారు.



బస్సు ఢీకొనడంతో మృతి చెందిన గొర్రెలు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

6న స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం: ఈనెల ఆరో తేదీన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర అవార్డులు ప్రదానం చేయనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పారిశుధ్య కార్మికులు, ప్రజలు, ఉద్యోగులు కావచ్చు, పబ్లిక్ రిప్రజెంటేటివ్స్ ఎవరైతే మంచి పని బాగా చేస్తే వారికి ప్రభుత్వం అవార్డులు ఇచ్చేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిర్ణయించినట్లు చెప్పారు. అవార్డులకు సంబంధించి జాబితా వస్తుందని, అవార్డులు అందజేయడం కూడా ఈనెల 6న ఉంటుందని, అందరు ప్రజా ప్రతినిధులు, జిల్లా ఇన్చార్జి మంత్రి, జిల్లా మంత్రులు ఆధ్వర్యంలో అవార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవార్డుల్లో అన్ని శాఖలను పరిగణనలోకి తీసుకుని, వాటిలో ఎంపిక చేసి 51 అవార్డులు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర స్థాయిలో అవార్డుకు ఎంపిక జరిగితే రాష్ట్ర స్థాయి అవార్డులు ఉంటాయన్నారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ గ్రీన్ స్పాట్ ట్రాన్స్‌ఫర్మేషన్ 83 పాయింట్ల లక్ష్యాన్ని రెండు వారాల్లో చేసినట్లు చెప్పారు. ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురం మున్సిపాలిటీల్లో, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఫ్రీ ని ప్రకటించనున్నట్లు చెప్పారు.


జంగిల్ క్లియరెన్స్ చేస్తున్న యంత్రం

మత్స్యకార గ్రామాలకు మార్గం సుగమం

కవిటి: మత్స్యకార గ్రామాలకు మార్గం సుగమం అయ్యింది. రోడ్డుపైకే ముళ్లపొదలు చొచ్చుకువచ్చి మత్స్యకార గ్రామాలకు వెళ్ళేవాళ్ళు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిపై మూసుకుపోతున్న దారులు అంటూ ప్రజాశక్తి కథనం ప్రచురించింది. ఆ తరువాత మత్స్యకార నాయకుడు గంతి శ్రీను ఆధ్వర్యంలో మత్స్యకార గ్రామస్తులు తమ గ్రామాలకు వెళ్లే రహదారి సమస్యను ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన విప్ మత్స్యకార గ్రామాలకు మార్గం సుగమం చేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు శుక్రవారం జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. దీనిపై మత్స్యకార గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.


రక్షించిన కార్మికుడితో ఎస్ఐ హరిబాబు, మెరైన్ సిబ్బంది, స్తంభాన్ని పట్టుకున్న కార్మికుడు

నదీ ప్రవాహంలో చిక్కుకున్న కార్మికుడు

రక్షించిన పోలీస్, మెరైన్ సిబ్బంది

సోంపేట: జిల్లా వ్యాప్తంగా గురువారం కురిసిన భారీ వర్షాల ప్రభావంతో మండల పరిధిలోని మహేంద్రతనయ నది నీటిమట్టం రాత్రికి ఒక్కసారిగా పెరిగింది. ఈ క్రమంలో బారువా - మూలపొలం గ్రామాల మధ్య నిర్మాణంలో ఉన్న కొత్త వంతెన వద్ద పనిచేస్తున్న కార్మికుడు వరద ప్రవాహంలో చిక్కుకోవడంతో, స్థానికులు అందించిన సమాచారం మేరకు బారువ పోలీసులు, మెరైన్ పోలీసులు కలిసి ఆయనను రక్షించి ఒడ్డుకు చేర్చారు. ఈ మేరకు పోలీసులు, స్థానికుల వివరాల మేరకు ఒడిశా, బాంజీ బాల్ చిలపడ గ్రామానికి చెందిన నవీన్ మాజీ అనే కార్మికుడు గురువారం సాయంత్రం పనిముట్లు తీసుకురావడానికి మూల పొలం సమీపంలో నిర్మాణం జరుగుతున్న వంతెన వద్దకు సుమారు 7 గంటల సమయంలో వెళ్లి, వరద ఉధృతికి కొట్టుకుపోయాడు. ప్రవాహానికి కొట్టుకుపోతూ, ప్రాణాపాయ స్థితిలో నదిలోని ఒక స్తంభాన్ని పట్టుకొని ఉండిపోయాడు. ఇది నది ఒడ్డునుంచి గమనించిన బారువ గ్రామానికి చెందిన రాజేష్ పంతులు, స్థానిక మత్స్యకారులు, ఎస్ఐ హరిబాబు నాయుడుకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఆయన సిబ్బంది జయరాం, బాలకృష్ణ, మెరైన్ పోలీస్‌స్టేషన్ సిబ్బందితో పాటు బారువా, కొత్తూరుకు చెందిన మత్స్యకారులు సహకారంతో పడవను ఉపయోగించి నదిలో చిక్కుకున్న కార్మికుడిని రక్షించి సకాలంలో సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చారు. సుమారు మూడున్నర గంటల పాటు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించిన అనంతరం కార్మికుడుని ఒడ్డుకు చేర్చడమే కాకుండా ప్రాథమిక చికిత్స కోసం వారు ఆస్పత్రికి తరలించారు. వరద ప్రవాహంలో చిక్కుకున్న కార్మికుడుని రక్షించేందుకు ధైర్యసాహసాలు ప్రదర్శించి, చకచక్యంగా వ్యవహరించిన పోలీసులను, సమాచారాన్ని ఇచ్చిన రాజేష్ పంతులతో పాటు సహకారం అందించిన మత్స్యకారులను ఎస్పి మహేశ్వర రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.


పలాస : యాత్రికులకు వడ్డిస్తున్న శ్రీధర్ బాబా

పలాసలో అన్నదానం

ప్రజాశక్తి- పలాస

పలాస శివాజీ నగర్‌లో శిర్డీ సాయిబాబా 107వ పుణ్యతిథి సందర్భంగా గురువారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఒకవైపు విపరీతంగా భారీ వర్షం కురుస్తున్నా యాత్రికులు వేల సంఖ్యలో వచ్చి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు దువ్వాడ శ్రీధర్ బాబా, ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు, యాత్రికులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం

శ్రీకాకుళం: అన్నదానం మహాదానమని ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు అన్నారు. ఎచ్చెర్ల మండలం కుశాలపురంలో దుర్గాదేవి విగ్రహాన్ని నెలకొల్పి తొమ్మిది రోజుల పాటు నవరాత్రి ఉత్సవాలను నిర్వహించిన అనంతరం శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ఏడాది కూడా అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించామని వివరించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో సుమారు 3500 మంది యాత్రికులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.


శ్రీకాకుళం : అన్నదాన కార్యక్రమంలో వడ్డిస్తున్న శ్రీనివాసరావు

అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

నియోజకవర్గంలో నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాల్లో నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. శుక్రవారం పోలాకి మండలంలో పల్లిపేట, వనితమండలం, నరసన్నపేట మండలంలో గెడ్డవానిపేట, కొబగాం, జలుమూరు మండలంలో కొమనా పల్లి నదీ పరివాహక ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలతో గొట్టాబ్యారేజీ అధిక శాతం నీటి ప్రవాహం ఎక్కువగా ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాల న్నారు. కార్యక్రమంలో కొమనాపల్లిలో ఎస్‌పి కెవి మహేశ్వర్ రెడ్డి, తహశీల్దార్లు సత్యనారాయణ, పి.శ్రీనివాస రావు, జెన్నీ రామారావు, సిఐ ఎం.శ్రీనివాస రావు, ఎస్ఐ రంజిత్, దుర్గా ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: మండలంలోని తెలికిపెంట సమీపంలో ఉగ్రరూపంగా ప్రవహిస్తున్న వంశధార నది ప్రవాహాన్ని తహశీల్దార్ ఎల్.మధుసూదన్, ఎంపిడిఒ బి.రామారావు, పోలీసులు, రెవెన్యూ, గ్రామ సచివాలయ ఉద్యోగులతో కలిపి పరిశీలించారు. గ్రామంలోని ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు వంశధార నీటి ప్రవాహాన్ని గమనిస్తూ సిబ్బందిని అప్రమత్తం చేశారు. అలాగే శుక్రవారం ఉదయం శ్రీకాకుళం డిఎస్‌పి వివేకానందతో పాటు పలువురు పోలీస్ అధికారులు వంశధార నది పరివాహక ప్రాంతంలో పర్యటించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మెళియాపుట్టి: కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన వరి పంట పొలాలను పలాస వ్యవసాయ సంచాలకులు మండేలా రామారావు, తహశీల్దార్ బడే పాపారావు, వ్యవసాయ అధికారుల బృందంతో కలిసి క్షేత్ర పరిశీలన చేశారు. పెద్ద పద్మాపురం, సిరియాకండి, పడ్డ, మాకనపల్లి చాపర, గంగరాజుపురం తదితర గ్రామాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్. దానకర్ణుడు, ఎస్ఐ పి.రమేష్ బాబు, విస్తరణాధికారి సుమంత్, గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రేము, నిహారిక, మండల టిడిపి నాయకుడు ఉర్లాను వసంత్, శ్రీధర్, ఎంపిటిసి రుషి, కూటమి నాయకులు రామారావు, జగబంధు, రైతులు పాల్గొన్నారు.


నరసన్నపేట : అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, ఎస్‌పి


పంట పొలాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

నష్టపరిహారం చెల్లించాలి

వజ్రపుకొత్తూరు: ఇటీవల కురిసిన వర్షానికి పంట పొలాలన్నీ వరద నీటితో ముంచేసి సముద్రాన్ని తలపిస్తున్నాయని సిపిఎం నాయకులు బి.ఆనందరావు అన్నారు. శుక్రవారం నగరంపల్లి, గుల్లలపాడు, గల్లి తదితర గ్రామాల పంట పొలాలను సిపిఎం బృందం పరిశీలించింది. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రూ.25 వేలు పెట్టుబడులు పంట పొట్ట దశలో వరద ఉధృతికి తీవ్ర నష్టాన్ని గురైందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. వరద తాకిడి గల కారణాలు, వాటి నివారణ కోసం చర్యలు తీసుకోమని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పాలకులు పెడచెవిన పెట్టడమే ఈ దుస్థితి కి కారణమైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వాగులన్నింటినీ పక్కాగా నిర్మించి వరద ఉధృతి నుంచి అవసరం ఉన్న చోట వాల్స్ నిర్మాణం చేయాలని ఆయన కోరారు. ఈ వరద కారణంగా వజ్రపుకొత్తూరు, పలాస వయా చిన్నబాడం రోడ్డును వెంటనే పూడ్చాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్.బైరాగి, ఎన్.మోహన్రావు, ఎన్.చంద్రయ్య, దువ్వాడ భాస్కరరావు, బమ్మిడి వెంకటరావు, దువ్వాడ కాంతారావు, సింగారి వల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


గాయపడిన నీలం

చెట్టు పడి వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- పోలాకి

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తాటి చెట్టు పడి వ్యక్తి కోమాలోకి వెళ్లిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికుల వివరాల మేరకు మండలంలో రాళ్ళపాడు గ్రామానికి చెందిన బోర నీలం దసరా రోజు ఇంటి అవసరాల నిమిత్తం ద్విచక్ర వాహనంపై నరసన్నపేట వెళ్లి తిరిగి వస్తుండగా రాళ్లపాడు తోట దగ్గరకు వచ్చేసరికి ద్విచక్ర వాహనంపై తాటిచెట్టు పడడంతో బండిపై నుంచి పడిపోయి కోమాలోకి వెళ్లాడు. వెంటనే స్థానికులు స్పందించి శ్రీకాకుళం ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అయితే ఈ ప్రమాదానికి ఆర్అండ్‌బి అధికారుల నిర్లక్ష్యమేనని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ రహదారిలో కొన్ని నెలలుగా ఆ తాటిచెట్టుపై పిడుగు పడి చెట్టు ఎండిపోయి ఉంది. అయినప్పటికీ అధికారులు తొలిగించకపోవడం ఈ దుర్ఘటనకు కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి వెంబడి ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించి నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


మాట్లాడుతున్న స్త్రీనిధి ఎమ్‌డి హరిప్రసాద్

ఎంసిపి ద్వారానే రుణం పొందాలి

ప్రజాశక్తి- లావేరు

స్వయం శక్తి సంఘాల సభ్యులు ఎంసిపి విధానంలోనే రుణం పొందాలని స్త్రీనిధి ఎండి, ఇన్‌ఛార్జి బ్యాంకు లింకేజీ డైరెక్టర్ జిబివిడి హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం తాళ్లవలసలో గ్రామ సంఘాలకు డిజిటల్ ఎంసిపిపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంసిపి ద్వారా రుణం పొందే విధానాన్ని వివరించారు. ఎంసిపి ద్వారానే బయమెట్రిక్ యాక్టివిటి ద్వారా అభివృద్ధి అవుతున్నారో తెలుసుకుని వారిని ఆయా రంగాల్లో అభివృద్ధిలో ముందుకు సాగేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులతో మాట్లాడి వారు పొందిన రుణం ఏవిధంగా వినియోగం చేసుకున్నారని అడిగి తెలుసుకున్నారు. డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో అన్ని రుణాలను డిజిటల్ ఎంసిపి ప్రకారం రుణం ఇవ్వడం జరుగుతుందని, ప్రతి సంఘం సభ్యురాలుకు తమకు అవసరమైన మొత్తం ఎనిమారేటర్ లాగిన్‌లో యాన్యూల్ క్రెడిట్ ప్లాన్ చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎల్‌డిఎం పి.శ్రీనువాసరావు, బ్యాంకు లింకేజీ డిపిఎం ఎ.నాగలక్ష్మి, ఎల్‌హెచ్ డిపిఎం బి.నారాయణరావు, స్త్రీనిధి ఎజిఎం వి.సత్యనారాయణ, ఎపిఎం బి.వి సుబ్బయ్యనాయుడు, స్త్రీ నిధి మేనేజర్ ఉదయకుమార్, సిసిలు, విఒఎలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రజా దర్బార్ ద్వారా వచ్చే ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, మున్సిపాలిటీ నుంచి వచ్చిన అర్జీలపై ఎమ్మెల్యే స్పందిస్తూ వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సరుబుజ్జిలి గ్రామం నుంచి టిడిపి నాయకుడు ఎండ రామారావు ఆధ్వర్యంలో కొంతమంది ప్రజాదర్బార్‌కు హాజరై సరుబుజ్జిలి పంచాయతీ స్మశాన వాటిక భూములు అన్యాక్రాంతం అయిపోతున్నాయని వాటి పరిరక్షణకు స్మశానవాటిక చుట్టూ ప్రహరీ గోడ, షెడ్డు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, టిడిపి మండల అధ్యక్షులు నూకరాజు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, జిల్లా టిడిపి ఎస్‌సిసెల్ నాయకులు గుర్రాల చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రామారావు

ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో కార్గో ఎయిర్‌పోర్ట్‌పై కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష బాధిత రైతులతో ఆదివారం ఉదయం సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్‌డిఒ జి.వెంకటేష్ తెలిపారు. శుక్రవారం రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో అందుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఏర్పాట్లలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని తమకు తెలియజేయాలని సూచించారు. ఆయనతో పాటు ఇన్‌ఛార్జి తహశీల్దార్ వాయిలపల్లి గిరి, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని తొగరాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సత్యనారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నియామకాలు బోటనీ, పొలిటికల్ సైన్స్ (సింగిల్ మేజర్) సబ్జెక్టులకు సంబంధించినవని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌తో పాటు పిహెచ్‌డి, నెట్ స్లెట్, ఏపీ సెట్ అర్హతలు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బోధనా అనుభవం అదనపు అర్హతలకు వెయిటేజీ ఇవ్వబడుతుందని, అలాగే బోధన నైపుణ్యం, మౌఖిక పరీక్ష ఉన్నత అర్హతల వెయిటేజీ ఆధారంగా తుది ఎంపిక జరుగుతుందని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తమ బయోడేటా విద్యార్హతతో కూడిన దరఖాస్తులను 04-10-2025 నుండి 09-10-2025 లోగా కళాశాలలో సమర్పించాలని కోరారు.

రేపు కళాకారుల సమావేశం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఈనెల 5న ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించే కళాకారుల సర్వసభ్య సమావేశాన్ని జయప్రదం చేయాలని సంఘ అధ్యక్షులు పేడాడ ధనంజయరావు ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం కళా ప్రదర్శనలు లేక వృద్ధాప్యంతో ఇబ్బందులు పడుతున్న వృద్ధ కళాకారులకు చేయూత, కళాకారుల సంక్షేమ సంఘం శాఖను ముందుకు నడిపేందుకు కార్తీకమాస వనభోజనాలు తదితర అంశాలపై విపులంగా చర్చించేందుకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి యావన్మంది కళాకారులు పెద్ద మొత్తంలో హాజరై కళాకారుల మనుగడ కొరకు తమ అభిప్రాయాలను తెలియజేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

'ఐతమ్' విద్యార్థులు ఎంపిక

టెక్కలి రూరల్: టెక్కలి ఐతమ్ కళాశాలలో జరిగిన ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ వారు నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ఐతమ్‌కు చెందిన ఐదుగురు విద్యార్థినులు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి నాగేశ్వరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారికి ప్రథమ వార్షిక వేతనం రూ.5.5 లక్షల ప్యాకేజీ అందించనున్నారు. ఈ అవకాశం విద్యార్థుల కెరీర్ పురోగతికి కీలకమైన మైలురాయిగా నిలవనుందన్నారు. కళాశాల యాజమాన్యంతో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ ఎస్ శ్రీనివాసరావు, డీన్ టిపిసి డాక్టర్ ఎం.సంతోష్ కుమార్, అధ్యాపకులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఈదురు గాలులతో కూడిన వర్షాలు గురువారం కురవడంతో విద్యుత్ సరఫరా చాలా చోట్ల నిలిచిపోయింది. కొన్ని ప్రాంతాల్లో శుక్రవారం పునరుద్ధరించారు. శ్రీకాకుళం పట్టణంలో గురువారం సాయంత్రానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. పట్టణం సమీప మండలాలు ఎచ్చెర్ల, శ్రీకాకుళం రూరల్ వంటి మండలాల్లో కొన్ని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. విద్యుత్ తీగులపై చెట్లు, కొమ్మలు పడటం వంటివి చోటు చేసుకున్నాయి. దీంతో లైన్లు పరిశీలించి చెట్లు, కొమ్మలు తొలగింపు చేపట్టి లైన్లు పునరుద్ధరించారు. విద్యుత్ అన్నిచోట్ల పునరుద్ధరించినట్లు విద్యుత్ శాఖ ఇఇ యోగేశ్వరరావు చెప్పారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

స్వదేశీ వస్తువులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

విదేశీ వస్తువులను విడనాడి, దేశీయంగా తయారైన వస్తువులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే శంకర్ పిలుపునిచ్చారు. 'ఇంటింటా స్వదేశీ' అనే నినాదంతో ముందుకు వెళ్లాలని సూచించారు. స్థానిక ఏడు రోడ్ల కూడలిలోని మున్సిపల్ మైదానంలో 'ఖాదీ ఫర్ నేషన్ - ఖాదీ ఫర్ ఫ్యాషన్' నినాదంతో ఏర్పాటు చేసిన ఖాదీ సంతను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్వదేశీ వస్తువుల స్టాల్స్‌ను ఆయన పరిశీలించి, విక్రయాలకు సంబంధించిన వివరాలను వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఖాదీ సంతలో మొత్తం 10 స్వదేశీ వస్తువుల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. స్వదేశీ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని తెలిపారు. అందులో భాగంగానే ఈ ఖాదీ సంతను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఖాదీ, చేతివృత్తులు, చేనేత, హస్తకళలు, సేంద్రీయ ఉత్పత్తులు, ఆయుర్వేదం, మిల్లెట్స్, మొక్కలు వంటి వాటిపై విస్తృత ప్రచారం చేపట్టినట్లు వివరించారు. దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి స్వదేశీ వస్తువుల వినియోగం ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

జిఎస్‌టిపై రైతులకు అవగాహన

కోటబొమ్మాళి: స్థానిక సచివాలయంలో సూపర్ జిఎస్‌టిపై మండల అభివృద్ధి అధికారి కె. ఫణీంద్రకుమార్, వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావులు బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణపై 18 శాతం ఉన్న జిఎస్‌టిని 5 శాతానికి తగ్గించిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పురపాలక సంఘం ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో జిఎస్‌టి 2.0పై వ్యాపారులకు మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిఎస్‌టి 2.0 వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రోణంకి వెంకటరావు, చార్టెడ్ అకౌంటెంట్లు కొండబాబు, బుడుమూరు శ్రీనివాస్, వాణిజ్య పన్నుల శాఖ మండల అధికారులు, వ్యాపారులు, ప్రజలు పాల్గొన్నారు.


ఆమదాలవలస : మాట్లాడుతున్న కమిషనర్ రవి

పొందూరు: జిఎస్‌టి 2.0తో ప్రజలకు ఎంతో ఆదా అవుతుందని జిఎస్‌టి నోడల్ అధికారి ఆర్.శేఖర్, ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు అన్నారు. పట్టణంలో సాయిబాబా వీవర్స్ సొసైటీలో జిఎస్‌టిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చిగులపల్లి రామ్మోహన్, చేనేత జౌళిశాఖ అధికారి వి.జి.శంకరరావు, సాయిబాబా వీవర్స్ సొసైటీ మేనేజర్ వట్టం శ్రీనివాసరావు, టిడిపి పట్టణ అధ్యక్షుడు అనకాపల్లి శ్రీరంగనాయకులు, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


సర్టిఫికెట్ అందుకుంటున్న రామారావు


ఇంపాక్ట్ శిక్షణలో యువకుడు ప్రతిభ

రణస్థలం: లావేరు మండలం అప్పాపురం గ్రామానికి చెందిన యువకుడు పతివాడ రామారావు హైదరాబాద్ వారు నిర్వహించిన ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ (వ్యక్తిత్వ వికాసం) సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రైన్ ద ట్రైనర్ వర్క్‌షాప్ 243 బ్యాచ్ శిక్షణలో మంచి ప్రతిభ కనబరిచి ఉత్తమ ట్రైనర్ సర్టిఫికెట్‌ను అందుకున్నారు. 35 రోజుల పాటు ఆన్‌లైన్ జూమ్ క్లాసులో ఉచితంగా వ్యక్తిత్వ వికాస పాఠాలు అభ్యసించిన ఆయన అనంతరం రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో జరిగిన ఆఫ్‌లైన్ శిక్షణలో లైఫ్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో తన ప్రతిభను ప్రదర్శించారు. శిక్షణ ముగింపులో ఇంపాక్ట్ ఫౌండర్ గురూజీ గంపా నాగేశ్వరరావు స్వయంగా సర్టిఫికెట్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా గురూజీ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు బానిసవుతున్నారని, అలాంటి వారికి సరైన దిశలో మార్గ నిర్దేశం చేసి తమ శక్తిపై నమ్మకం పెంపొందించి ఉన్నత స్థితికి తీసుకెళ్లడం కోసం ఈ కోర్సు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ హెడ్ సుధీర్ బంధం రావూరి, రీజనల్ ప్రెసిడెంట్ త్రినాథ, ఇన్‌ఛార్జి సాయి అపేక్ష, ఇన్‌ఛార్జి కొలిపాక నాగలక్ష్మి, కోఆర్డినేటర్ అరవింద, మెంటర్ ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.


80 అడుగుల రోడ్డులో పడిపోయిన చెట్టు

కూలిన చెట్లు

శ్రీకాకుళం సిటీ: నగరంలో ఈదురు గాలులు, వర్షాలకు చెట్లు కూలాయి. దీంతో వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. అధికారులు స్పందించి చెట్లు తొలగించే చర్యలు చేపట్టారు. నగరంలో కలెక్టరేట్, 80 అడుగుల రోడ్డు, బలగ ప్రాంతాల్లో చెట్లు కూలిపోయాయి. శుక్రవారం చెట్లు పునరుద్ధరణకు అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం సాయంత్రం నుంచి వర్షాలు అదుపులోకి రావటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.


కలెక్టరేట్ సమీపంలో పడిపోయిన చెట్టు


మాట్లాడుతున్న కృష్ణచైతన్య

బొద్దాంలో కార్యకర్తలతో చైతన్య

పోలాకి: మండలం బొద్దాం, రెహమానుపురం, కోడూరు క్లస్టర్ పరిధి బొద్దాంలో కార్యకర్తలతో కృష్ణచైతన్య కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మాన కృష్ణ చైతన్య మాట్లాడుతూ వైసిపికి కార్యకర్తలే పునాది అని, గ్రామ కమిటీలో కార్యకర్తలను భాగస్వాములను చేసి పార్టీ మరింత పటిష్టంగా ఉండడానికి మీరందరూ బలోపేతం చేయాలని కోరారు. 2029లో మళ్లీ సిఎంగా జగన్మోహన్ రెడ్డిని చూసేవరకు ప్రతి కార్యకర్త పార్టీ కోసం శ్రమించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ముద్దాడ బైరాగి నాయుడు, మండల అధ్యక్షులు కణితి కృష్ణారావు, నియోజకవర్గ ఎస్‌సిసెల్ అధ్యక్షులు కల్లేపల్లి లక్ష్మణరావు, నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షులు సాలిన నగేష్ కుమార్, మండల యూత్ అధ్యక్షులు రెంటికోట త్రినాధరావు, చింతాడ ఉమా మహేశ్వరరావు, రావాడ అప్పన్నరాజు, సర్పంచ్‌లు సనపల సోమేశ్వరరావు, ఎంపిటిసి పైల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.


సిఎం చంద్రబాబుకు సమస్యను వివరిస్తున్న ఉషారాణి

సిఎం సహాయనిధికి వినతి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలంలోని పైడిభీమవరం గ్రామానికి చెందిన మామిడిపాక ఉషారాణి కుమార్తె (ఖుషి) సుమారు 18 నెలలుగా ఆరోగ్యం బాగు లేనందున సుమారుగా కోటిన్నర వరకు ఖర్చవుతున్నందున విషయం తెలుసుకున్న పైడి భీమవరం జనసేన నాయకులు, శ్రీకాకుళం జిల్లా జనసేన కార్యదర్శి వడ్డాది శ్రీనివాస రావు ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు దృష్టికి తీసుకొని వెళ్లి ఆయన సహకారంతో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు తెలియజేయగా వారి సహకారంతో సిఎం చంద్రబాబు నాయుడును ఆ కుటుంబం సహాయం కోసం విన్న వించుకోవడం జరిగిందని శ్రీనివాసరావు తెలిపారు.


విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

కవిటి: అక్టోబర్ 4 నుంచి 6 వరకు విశాఖపట్నం జిల్లా నర్సీపట్నంలో జరగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీల్లో మాణిక్యపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు పాల్గొంటున్నారని పాఠశాల హెచ్‌ఎం ఎం.వైకుంఠ రావు తెలిపారు. 10వ తరగతి చదువుతున్న విజయ లక్ష్మీ బిసాయి, 9వ తరగతి చదువుతున్న కాళిదాస్ సాహు, కాకర్ల సుమన్, సమీరా బిసాయి, 8వ తరగతి నుంచి మద్రిపాటి హర్షవర్ధన్ ఈ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. విద్యార్థుల ఎంపికపై హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థుల్లో ప్రతిభకు కృషిచేసిన వ్యాయామ ఉపాధ్యాయులు రవి కుమార్ మహంతి, మద్రిపాటి తోటారావును అభినందించారు.

విద్యార్థిని అదృశ్యం

శ్రీకాకుళం సిటీ: నగరంలో ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ ఏడాది చదువుతున్న విద్యార్థిని (మైనర్ బాలిక) కనిపించటం లేదని కుటుంబ సభ్యులు రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రామారావు కేసు నమోదు చేశారు. గత నెల 29 నుంచి కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆచూకీ కోసం ప్రత్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'ఉపాధి'ని వినియోగించుకోవాలి

పొందూరు: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, చిన్న, సన్నకారు రైతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్ అన్నారు. శుక్రవారం మండలంలో 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనుల గుర్తింపుకు పొందూరు, దల్లిపేట, అచ్చిపోలవలస, కొంచాడ, లోలుగు, తోలాపి, తుంగపేట గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో రహదారుల నిర్మాణంతో పాటు, చిన్న, సన్నకారు రైతుల భూముల్లో పండ్ల తోటల పెంపకం, పశుగ్రాస పెంపకం, గోకులం షెడ్స్ నిర్మాణం వంటి పనుల ఎంపికపై అవగాహన కల్పిస్తున్నామని ఎపిఒ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రేగడి లక్ష్మి, టిడిపి మండల ఉపాధ్యక్షుడు శేషగిరి నాయుడు, ఎపిఎం రమణమూర్తి, ఇఒ మోహన్‌బాబు, పట్టణ అధ్యక్షులు అనకాపల్లి శ్రీరంగనాయకులు, దండా రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.


పొందూరులో నిర్వహిస్తున్న గ్రామసభ

ఆదర్శప్రాయుడు మహాత్ముడు


గాంధీ విగ్రహానికి నివాళ్లర్పిస్తున్న మాజీమంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

ప్రపంచానికే ఆదర్శప్రాయుడు మహాత్ముడు మోహన్ దాస్ కరంచంద్ గాంధీ అని, ఆయన చూపిన బాటలో నేటి తరాలు ముందుకు సాగాలని మాజీమంత్రి డా.సీదిరి అప్పలరాజు అన్నారు. గురువారం గాంధీ జయంతి సందర్భంగా కాశీబుగ్గ బస్టాండ్ వద్ద గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యాగ్రహం, అహింస, శాంతి మార్గాల్లో నడిచి దేశానికి స్వాతంత్ర్యం సాధించి పెట్టిన మహాత్మ గాంధీ ప్రపంచానికే ఆదర్శప్రాయులని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు శిష్టు గోపీ, మున్సిపల్ వైస్ చైర్మన్ బోర బుజ్జి, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అంబటి ఆనందరావు, పట్టణ ఉపాధ్యక్షులు గుజ్జు జోగారావు, నర్తు వెంకటరమణ, పట్టణ ప్రధాన కార్యదర్శి, కౌన్సిలర్ పప్పల ప్రసాదరావు, కౌన్సిలర్ పిచ్చుక అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగధనుల సేవలు మరువలేనివి

కవిటి: త్యాగధనుల సేవలు మరువలేనివని వైస్ ఎంపిపి పూడి నేతాజీ అన్నారు. మహాత్మా గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగతి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. బెజ్జిపుట్టుగలో ఎం. నరసింహమూర్తి, గ్రామస్తులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

గేయామృతకు అభినందన

టెక్కలి: స్థానిక ఎన్‌టిఆర్ క్రీడావికాస్ కేంద్రానికి చెందిన బొడ్డ గేయామృత త్రైక్వాండోలో జాతీయ స్థాయికి ఎదిగిన నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గేయామృతను అభినందించారు. ఇటీవల బన్నువాడ గ్రామంలో పర్యటించిన మంత్రి దృష్టికి స్థానికులు విషయాన్ని తీసుకురావడంతో ఆయన ఆమెను అభినందిస్తు శాలువా కప్పి సత్కరించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఒక యువతి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని బంగారు పతకాన్ని సంపాదించడం, తద్వారా జాతీయస్థాయికి ఎంపిక కావడంపై మంత్రి అభినందించారు. మంత్రి దత్తత గ్రామమైన బన్నువాడ నుంచి జాతీయస్థాయికి ఎదగడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా కోచ్ నర్సిపురం శేఖర్‌ను మంత్రి అభినందించారు.


గేయామృతను అభినందిస్తున్న అచ్చెన్నాయుడు


కళాకారులతో కమిటీ సభ్యులు

కళాకారులకు సన్మానం

ప్రజాశక్తి- కవిటి

మండల కేంద్రంలోని శ్రీ దుర్గామాత ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హరికథ, సత్సంగ ప్రసంగంతో పాటు స్థానిక కళాకారులతో కచేరీ నిర్వహించారు. వేడుకలు ముగింపు సందర్భంగా గత కొన్నేళ్లుగా ఉద్దానం ప్రాంతంలో తమ గాత్రం, సంగీతంతో అలరిస్తున్న స్థానిక కళాకారులు బెందాలం రామారావు, పండి హరి, గొనప లక్ష్మణమూర్తిని దేవస్థానం కమిటీ సభ్యులు దుశ్శాలువ కప్పి సన్మానించారు. అనంతరం వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న విప్ అశోక్

ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలో 22వ వార్డు పరిధిలో వికెపేట, కొత్తవీధిలో నిర్మించిన ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు కాళ్ల అర్జున కుటుంబ సభ్యులచే ఏర్పాటు చేసిన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాలం అశోక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు పతి తవిటియ్య, నందిగాం కోటేశ్వరరావు, వార్డు కౌన్సిలర్ కాళ్ల దిలీప్ కుమార్, లీలారాణి, నందికి జాని, దట్టి శ్రీను, కృష్ణయ్య, జానికి రామ్, ధర్మరాజు, కాళ్ల జయదేవ్, కాళ్ల ప్రవీణ్, సంతోష్, గన్ని వెంకట రమణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ లేక జనరేటర్ల ఏర్పాటు

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని దేరసాంలో రెండు రోజులుగా అకాల వర్షాలు కురుస్తున్న కారణంగా విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామ ప్రజలకు తాగడానికి నీళ్లు కూడా లేకపోవడంతో ప్రజల కష్టాలను గుర్తించిన టిడిపి నాయకులు, ఎంపిటిసి దన్నాన వంశీకృష్ణ స్పందించి గ్రామంలో జనరేటర్లు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా అందించి ప్రజలకు నీటి కష్టాలను తీర్చడంతో గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

సేవాగుణం ఉండాలి

ప్రజాశక్తి- పలాస

మానవతావాదం, సేవచేసే గుణం ప్రతీ ఒక్క మనసులో ఉండాలని, అప్పుడే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని చిన్న గురుదాసుపురం ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పాలిన కృష్ణారావు, కార్యదర్శి జినగ తాతారావులు పేర్కొన్నారు. మండలంలోని చిన్న గురుదాసుపురం ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా బుధవారం కోసంగిపురం జంక్షన్ వద్ద గల అనాథ, వృద్ధాశ్రమం లోని అనాథలు, వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ నేలపై పుట్టిన ప్రతి మనిషి ఈ సమాజంలో ఒక మంచి కర్తవ్యాన్ని నిర్వర్తించాలని అప్పుడే ఆ జన్మకు అర్థం ఉంటుందన్నారు. అసోసియేషన్ చేపట్టే సేవా కార్యక్రమాలు నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయని ఆకాంక్షించారు. ఆ లక్ష్యంతోనే అసోసియేషన్ పనిచేస్తుందన్నారు. అసోసియేషన్ కోశాధికారి, శాలిన రమేష్, సోషల్ మీడియా పిఆర్ఒ, కొండే తేజేశ్వరరావు, ఉపాధ్యక్షులు జినగా ధర్మారావు, పి విజయ్, వల్లభరావు, జనార్దన్, మురళి, జోగారావు, శరత్, జినగ పాపయ్య, పురుషోత్తం, శ్యామ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాసరావు

ఆదికర్మయోగితో గిరిజనులకు మేలు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఆది కర్మయోగి కార్యక్రమం ద్వారా గిరిజనులకు ఎంతో మేలు చేకూరుతుందని ఎంపిడిఒ ఎం.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని పరశురాంపురం పంచాయతీ పరశురాంపురం, పెద్దమడి కాలనీ, ఎర్రగడ్డ తదితర గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభలో గ్రామంలో ఉన్న సమస్యలపై అధ్యయనం చేసి గ్రామస్తుల కోరిక మేరకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సూచించారు. గ్రామంలో ఉన్న ప్రధాన సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామంలో పారిశుధ్యం అభివృద్ధికి గ్రామస్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ తెంబూరు ప్రసాదరావు, ఎపిఎం త్రినాథమ్మ, కార్యదర్శి శివాజీ, ఎన్ఎల్‌వి ప్రసాద్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొగిలిపాడులో విషాదం

వరద నీటిలో మునిగి తాపీమేస్త్రి మృతి


గోపాలరావు (ఫైల్)

పలాస: తుపాను కారణంగా గురువారం కురిసిన భారీ వర్షాలకు వరదనీరు ప్రవహించడంతో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మొగిలిపాడుకు చెందిన తాపీమేస్త్రీ సైన గోపాలరావు (45) మృతి చెందాడు. ఈయన మృతదేహం గ్రామానికి సమీపంలో జాతీయరహదారి కల్వర్టు వద్ద శుక్రవారం రాత్రి లభించింది. గ్రామస్తుల కథనం ప్రకారం గోపాలరావు గురువారం సాయంత్రం పంటపొలాలు చూసేందుకు వెళ్లగా గుంతలో ప్రవాహానికి పడిపోయాడు. రాత్రి వేళయినా ఆయన రాకపోవడంతో కుటుంబీకులు, గ్రామస్తులు ఆయన కోసం వెతికారు. శుక్రవారం సాయంత్రం కల్వర్టు వద్ద బురదలో కూరుకుపోయిన గోపాలరావు మృతదేహం కనిపించింది. మృతుడుకు భార్య సరస్వతి, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. ఆయనకు మద్యం అలవాటు ఉండడంతో నీటిలో పడిన తరువాత లేవలేకపోయి ఉంటాడని అంతా భావిస్తున్నారు. ఈ ఘటనపై కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ వద్ద ప్రస్తావించగా తమకు సమాచారం వచ్చిందని, తమ సిబ్బందిని పంపిస్తున్నామన్నారు.

ఆలయంలో చోరీకి యత్నం


పట్టుకున్న గ్రామస్తులు, (ఇన్‌సెట్‌లో) దొంగిలించిన వస్తువులు



వజ్రపుకొత్తూరు: మండలం అనకాపల్లి వద్ద కొండమహంకాళీ అమ్మవారి గుడిలో చోరీకి ప్రయత్నం చేస్తున్న యువకుడిని స్థానిక యువత పట్టుకొని బంధించి పోలీసులకు అప్పగించారు. గ్రామస్తుల వివరాల మేరకు గ్రామాల్లో తిరుగుతూ వంట సామగ్రి అమ్మకాలు చేస్తున్నట్టు యువకుడు అమ్మవారి గుడివద్ద గురువారం రాత్రి కనిపించడం అనుమానం వచ్చి ఆ యువకుడిని పట్టుకొని ప్రశ్నించగా గుడిలో బంగారు అభరణాలు దొంగి లించేందుకు వచ్చినట్టు అంగీకరించడంతో పాటు అప్పటికే మందస మండలం వివిధ గ్రామంలో గల అమ్మవారి గుడిలో దొంగలించినట్టు అంగీకరించారు. శుక్రవారం ఆ యువకుడిని, ఆయన దొంగలించిన ఆభరణాలను పోలీసులకు అప్పగించారు. ఆ యువకుడి వద్ద లభించిన ఆధార్‌కార్డు ప్రకారం నరసన్నపేటకు చెందిన కల్లూరి ప్రభుదాసుగా స్థానికులు చెబుతున్నారు. కాగా పగలంతా వంటసామగ్రి అమ్మకం దారుడిగా వచ్చి రాత్రి సమయంలో ద్విచక్రవాహనంపై వచ్చి అమ్మవారి దేవాలయాల్లో దొంగలించడం ఎన్నోఏళ్ళుగా సాగిస్తున్నట్టు యువకుడు చెప్పినట్టు తెలిపారు.


వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శంకర్

వరద ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

భారీ వర్షాలకు వంశధార నదీ ప్రమాదకర స్థాయికి ప్రవహిస్తూ ఉండటంతో ప్రభావిత గ్రామాలను ఎమ్మెల్యే గొండు శంకర్ శుక్రవారం ఆర్‌డిఒ సాయి ప్రత్యూషతో కలిసి పరిశీలించారు. వరద ప్రభావిత ప్రాంతాలైన కరజాడ, బూరవెల్లి, కళింగపట్నం గ్రామాలను ఆయన సందర్శించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. నష్టపోయిన పంటలకు ప్రభుత్వమే ఆదుకుంటుందని ఎమ్మెల్యే శంకర్ రైతులకు హామీఇచ్చారు. అధికారులు అందుబాటులో ఉండి సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.


సన్మానిస్తున్న కమిటీ సభ్యులు, మహిళలు

నాట్య గురువుకు సత్కారం

ప్రజాశక్తి- కవిటి

ప్రముఖ కళాకారుడు, ఆల్ ఇండియా కళా రంగం ఎగ్జిక్యూటివ్ మెంబర్, నాట్య గురువు తిప్పన ధనంజయ రెడ్డికి ఘన సన్మానం జరిగింది. మండలంలోని జాడుపూడి ఆర్‌ఎస్‌లో స్థానిక మహిళలకు ధనుంజయ రెడ్డి కొంతకాలంగా నాట్యంలో శిక్షణ ఇచ్చారు. దీన్ని పురస్కరించుకుని వర్తక సంఘం ఏర్పాటు చేసిన శ్రీ దుర్గా పూజా ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ధనుంజయ రెడ్డితో పాటు కోలాటం కళాకారిణిలకు వర్తక సంఘం పూజ కమిటీ ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో ఎంఎంసి చైర్మన్ మణిచంద్ర ప్రకాష్ రెడ్డి, జడ్‌ఆర్‌యుసి మెంబర్ శ్రీనివాస రౌళో, బాసుదేవ్ రౌళో, మృత్యుంజయ, సంతోష్, లోపింటి కృష్ణ, మీనారావు, శ్రీను, ధర్మారావు, శ్యాం గుణ, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నృత్య నీరాజనం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం గ్రామదేవత శ్రీస్వేచ్ఛావతి అమ్మవారికి సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శ్రీవెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ చిన్నారులు చేసిన కూచిపూడి, అమ్మవారి జానపద గీతాలు, ఒరియా సంబల్పూరి నాట్యాలు యాత్రికులను మంత్రముగ్ధులను చేశాయి. కార్యక్రమంలో 30 మంది చిన్నారులు నాట్య గురువు శృతి పట్నాయక్ అకాడమీ వ్యవస్థాపకులు చిన్నా గురు స్వామి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజలు పెద్దఎత్తున వచ్చి చిన్నారులకు ప్రశంసల వర్షం కురిపించారు. ఆలయ కమిటీ కళాకారులకు సత్కరించారు.


నృత్యాలు చేస్తున్న చిన్నారులు